క్లుప్తంగా

వైభవంగా భక్తాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ట



కైకలూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ ఎదుట శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవోపేతంగా ప్రారంభమైంది. మొదటి రోజు స్వామికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఆయన కుమారుడు శ్యామ్ ఫణికుమార్ దంపతులు ఈ పూజకార్యక్రమాల్లో పాల్గొన్నారు. త్రయాహ్నిక దీక్షతో ఆర్తమూరుకు చెందిన అయిలూరి జై కిషోర్ శిష్యబృందం హోమ కార్యక్రమాలను నిర్వహించింది. బుధవారం శ్రీభక్తాంజనేయ, శ్రీ నాగమణి సహిత నాగరాజు, నూతన శిఖర, గణపతి ప్రతిష్టలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జంపన రామలింగరాజు, కొండరాజు, బుర్ల సత్యనారాయణ, రాగాల వెంటేశ్వరరావు, వసుంధర మురళీ, దుర్గారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



తోట్లవల్లూరు: మండలంలోని చినపులిపాకలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను సోమవారం సర్పంచ్ ఆరేపల్లి శివరామకృష్ణ ప్రారంభించారు. స్థానిక వెస్ట్‌సైడ్ చానల్లో కూలీలతో కలిసి శివరామకృష్ణ పూజలు జరిపి పనులకు శ్రీకారం చుట్టారు. పనులకు 150 మంది వరకు కూలీలు హాజరయ్యారు. విద్యా కమిటీ చైర్మన్ నాగేంద్ర, పంచాయతీ వార్డు సభ్యులు సుంకర సీతారామయ్య, వడ్డాణం దుర్గ, సన్నాల గోపీరాజ, పతం రామకృష్ణ(చిన్ను), ఫీల్డ్ అసిస్టెంట్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు



వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలోని మసీద్ వద్ద ముస్లింలు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన షేక్ అన్వర్ బాషా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తే మంచి జరుగుతుందనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు అన్వర్ తెలిపారు.

కొడాలి నానికి పామర్రు మహిళల ఆశీర్వాదం



గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విజయానికి తమ ఆశీస్సులు ఉంటాయని పామర్రు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో ఉన్న కొడాలి నానిని స్థానిక 14వ వార్డులో మహిళలు కలుసుకుని హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయానికి మహిళల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ప్రత్యేకించి కొడాలి నాని విజయం సాధించాలని తాము కోరుకుంటున్నామన్నారు. తమకు పరిచయం ఉన్న గుడివాడ నియోజకవర్గ ఓటర్లందరినీ కొడాలి నానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరుతూ తాము ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కురుమద్దాలి, గొల్వేపల్లి, కొమరవోలు సర్పంచ్‌లు భారతి, శాంతకుమారి, రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పి. రత్నకుమారి, పామర్రు వైఎస్సార్ సీపీ మహిళా నేతలు ఆరుమల్లి రమాదేవి, కె.కీర్తి, శ్రీలక్ష్మి, నీలిశెట్టి పద్మ, రాణి, పామర్రు ఎంపీటీసీ సభ్యుడు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవడం బాధ్యత

మండవల్లి: ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా మే 13న జరిగే ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెరికెగూడెంలో సోమవారం కళాజాత నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారుల బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది.

తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు

మండవల్లి: వేసవిలో తాగునీటి కొరతను అధిగమించేందుకు స్థానిక అగ్రహారంలో నూతిని సోమవారం సర్పంచ్ మెండా ఝాన్సీ శుభ్రం చేయించారు. కూలీలతో బావిలో ఎల్లా వేయించి నీరు సక్రమంగా ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

కొడాలి నాని ప్రచారానికి విశేష స్పందన



ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోంది. ఆయన పట్టణంలోని 18, 14 వార్డుల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు వెంటరాగా గడప గడపకు తిరుగుతూ ఆయన ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. 18వ వార్డు ఇన్‌చార్జి అల్లం రామ్మోహనరావు ఆధ్వర్యంలో తొలుత ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానిక వ్యాపారులను, కార్మికులను పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పొందుతున్న పథకాలు ఏ మేరకు సంతృప్తినిస్తున్నాయి తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు హారతులు ఇచ్చి నానీకి తమ మద్దతు తెలిపారు. చిన్నారులను ఎత్తుకుని నానీ ముద్దాడారు. నీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలుపై ప్రజల వద్ద నుంచి సమాచారం తెలుసుకున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం నీటి సమస్య పెద్దగా తలెత్తడం లేదని మహిళలు నానీకి వివరించారు. అధిక సంఖ్యలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వెంటరాగా ప్రచారం ముమ్మరంగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు,



ఎమ్మెల్యే కొడాలి నానికి హారతి ఇస్తున్న మహిళలు

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, పాలడుగు రామ్ ప్రసాద్, చుండూరి శేఖర్, కె.ఆంజనేయ ప్రసాద్, వెంపటి సైమన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అల్లం సూర్యప్రభ, జ్యోతుల సత్యవేణి, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, సర్దార్‌బేగ్, జోగా సూర్యప్రకాశరావు, చింతల భాస్కరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, ఉపాధ్యక్షుడు అలీబేగ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయం

పెదపారుపూడి: వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధించేందుకు బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలే కీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ అన్నారు. పెదపారుపూడిలో సోమవారం రాత్రి బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ గ్రామాల వారీగా కార్యకర్తలకు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలి అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గత ఎన్నికల్లో మండలంలో సుమారు ఆరు వేల మెజార్టీతో తనను గెలిపించారన్నారు. మరోసారి అంతకన్నా ఎక్కువ మెజార్టీ తీసుకుని రావటానికి కార్యకర్తలు పని చేయాలాని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ఎంపీపీ గోగంసురేష్, వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, మండల కన్వీనర్ గోళ్ల సోమేశ్వరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ దొండపాటి రాంబాబు, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, నాయకులు చీకుర్తి దవరప్రసాద్, తుమ్మల కోటేశ్వరరావు, చిగురుపాటి శ్రీధర్, బొడ్డు రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, పక్కన ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

పోలీసుల కవాతు



పామర్రు: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసుల కవాతు నిర్వహించామని గుడివాడ డీఎస్పీ పీ శ్రీకాంత్ తెలిపారు. పలు ప్రాంతాలలో పోలీసుల కవాతును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు జరగబోయే సార్వత్రిక ఎన్నికలు–2024 ను దృష్టిలో ఉంచుకుని ఈ కవాతు నిర్వహించామని తెలిపారు. పామర్రు పీఎస్ పరిధిలోని పామర్రు, కనుమూరు, కొండిపర్రు, పసుమర్రు, జుఝువరం తదితర గ్రామాల్లోని రహదార్ల వెంబడి కవాతు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ పీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడువి నీచ రాజకీయాలు

గుడివాడ టౌన్: చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం అంతా కుట్రలు, కుతంత్రాలు, వంచనతోనే కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లు పెన్షన్ పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు ఇప్పించడం చంద్రబాబు నాయుడుకు ఓటమి భయం పట్టుకుందని అనడానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు నాయుడు తన కులానికి చెందిన ఒక వ్యక్తితో ఈ దురాగతానికి పాల్పడ్డారన్నారు. ఇది వలంటీరు వ్యవస్థను కట్టడి చేశామని అనుకుంటున్నారు కాని ఇది కేవలం పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్ మీద ఆధారపడి జీవించేవారికి వెన్నుపోటని పేర్కొన్నారు. 58 నెలులగా వలంటీరు వ్యవస్థ పెన్షన్ లబ్ధిదారులతో మమేకమైందన్నారు. వారు ఈరోజు పెన్షన్ పంపిణీ చేయకూడదని అనడం వలంటీరు వ్యవస్థను కించపర్చడం, అవమానించడం అవుతుందన్నారు. ఈ క్రియ వలన చంద్రబాబు నాయుడు నష్టపోతారని వైఎస్సార్ సీపీకి మేలు జరుగుతుందని తెలిపారు. 17వ వార్డు ఇన్‌చార్జ్ దారం కాంచనమాల పాల్గొన్నారు.

అలీనఖీపాలెంలో చెస్ట్‌బీటింగ్



పమిడిముక్కల: పవిత్ర రంజాన్ నెల 21వ రోజు హజరత్ ఇమామ్ అలీ వర్ధంతిని అలీనఖీపాలెంలోని హజరత్ ఇమామ్ హుస్సేన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జారీను ఊరేగించి చెస్ట్‌బీటింగ్ చేశారు. రక్తం చిందించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్ఐ శ్రీనివాస్ బందోబస్తు నిర్వహించారు.

కొల్లేరు ప్రజల ఆత్మీయ సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కైకలూరు: కొల్లేరు సమగ్ర అభివృద్ధిపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆటపాక ఎమ్మెల్సీ నివాసం వద్ద గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కొల్లేరు ప్రజల ఆత్మీయ సమావేశానికి పార్టీలకు అతీతంగా ప్రజలు తప్పక హాజరుకావాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. ముందస్తు సమాయత్తం నిమిత్తం కైకలూరు, మండవల్లి మండలాల్లో కొల్లేరు పరివాహక గ్రామాలైన చటకాయి, నత్తగుల్లపాడు, పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం, గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు, గోకర్ణపురం, లక్ష్మీపురం, వడ్లకూటితిప్ప, కొవ్వాడలంక, పులపర్రు, చింతపాడు, పెనుమాకలంక, మణుగునూరు, నందిగామలంక, నుచ్చిమిల్లి, ఇంగిలిపాకలంకలో సోమవారం ఆయన పర్యటించారు. పెద్దలను కలసి తప్పక సభకు హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ముంగర నరసింహారావు, పార్టీ ఏలూరు జిల్లా సేవాదళ్ కార్యదర్శి బలే నాగరాజు, కొల్లేరు గ్రామాల సర్పంచులు జయమంగళ కాసులు, ఘంటసాల శేషారావు, కె.గంగయ్య, ఘంటసాల చిన్నవిష్ణు, జయమంగళ తిరుపతి వెంకన్న, ముంగర పెద్ద నాగరాజు, సైదు చందరాజు, నాయకులు బలే సముద్రుడు, ఘంటసాల జగన్నాథం, ముంగర మల్లికార్జున, సైదు కామేష్, సాయి, కృష్ణ, ఎంఎస్.రాజు, సైదు వెంకటేశ్వరరావు, రామారావు, మహేష్, సత్తిబాబు, కృష్ణ నందనరావు, రంగారావు, సుబ్బరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పార్టీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా భుజబలపట్నం గ్రామంలో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌తో కలసి సోమవారం పర్యటించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ వలంటీర్లును గ్రామాల్లో కుటుంబాలు సొంత బిడ్డలుగా చూశారన్నారు. ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా సూర్యుడు ఉదయించకముందే ఇంటి వద్దకు వలంటీర్లు వచ్చి సేవలు అందిస్తున్నారన్నారు. అటువంటి వారిపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడంతో మూడు నెలల పాటు పింఛన్లు ఇంటి వద్ద లభించే అవకాశం లేదన్నారు. ఎమ్మెల్సీ జమంగళ వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీపై ప్రజల్లో పూర్తి నమ్మకం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీని ఆదరిస్తున్నారన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి విజయం చేకూర్చాలని కోరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు వినయ్‌తో కలసి యువకులు భారీ ర్యాలీ చేపట్టారు. గ్రామంలో అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, సర్పంచ్ గురజాల రామతులసి, ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ముంగర నరసింహారావు, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి కారుమూరి నాయకులు

ఆక్వా చెరువులకు నీటిని తరలిస్తే చర్యలు

ఆర్డీఓ ఖాజావలి

కైకలూరు: కాల్వలకు త్వరలో విడుదల చేయనున్న తాగునీటిని ఆక్వా రైతులు చెరువులకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డీఓ ఎస్‌కే.ఖాజావలి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పోలరాజ్ చానల్, కైకలూరు చానల్, క్యాంబెల్ చానల్, మోటూరు చానల్‌ను రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, తహసీల్దార్లతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మంచినీటి కాల్వల్లో ఉన్న తూటును తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారన్నారు. 80 శాతం గుర్రపుడెక్క తొలగించారని, మిగిలిన 20 శాతం తొలగించేందుకు మరో 3, 4 రోజులు పడుతుందన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసే ముందు అన్ని చానళ్లను సందర్శించేలా గ్రామ, మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లను ఆదేశించినట్లు తెలిపారు. చానల్లో అక్రమ మోటార్లు లేకుండా నియంత్రించేందుకు నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అక్రమ మోటార్ల ద్వారా నీటిని తోడేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించబోమని ఆర్డీఓ హెచ్చరించారు.



కైకలూరులో చానల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖాజావలి, తహసీల్దార్ పోతురాజు

మండవల్లిలో..

మండవల్లి: కాలువలో మోటార్లు వినియోగించి నీటిని తోడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీఓ ఎస్‌కే ఖాజావలీ అన్నారు. మండలంలోని అయ్యవారిరుద్రవరంలో పంట కాలువలో నీటిని తాగునీటి చెరువులకు పెట్టడానికి సోమవారం కాలువను ఆర్డీఓ పరిశీలించారు. మండవల్లి తహసీల్దార్ జేఎస్ సుభాని, కైకలూరు తహసీల్దార్, ఇరిగేషన్ అధికారి రాజగోపాల్ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు

ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: అవ్వాతాతలకు సకాలంలో పింఛన్లు అందకుండా చంద్రబాబు నాయుడు అడ్డదారిలో అన్యాయం చేశారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. సోమవారం కలిదిండి పరిధిలోని 9వ వార్డులో 7వ రోజు గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ నాయకులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ అవ్వాతాతలు, వితంతువుల, వికలాంగులకు దేశంలోనే ఎక్కడాలేని విధంగా రూ.3 వేల పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. లబ్ధిదారుడి ఇంటికే సంక్షేమ ఫలాలు అందించాలనే మహోన్నత ఆశయంతోనే వలంటీర్ వ్యవస్థకు జగనన్న శ్రీకారం చుట్టారని వెల్లడించారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ అనే తేడా లేకుండా అర్హులందరికీ వలంటీర్లు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో అందరూ ఇంటికే పరిమితమైతే, ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన వలంటీర్లపై టీడీపీ, జనసేన నాయకులు వక్రంగా వ్యాఖ్యలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వలంటీర్లు ప్రచారం చేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమని, ఎవరో చెబితే ప్రజలు మారే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వ్యవస్థపై చంద్రబాబు విషం చిమ్మడం బాధాకరమన్నారు. అవ్వాతాతలు ఉదయాన్నే పింఛను అందుకునేవారని, ఇప్పుడు మళ్లీ పాత రోజులు వచ్చాయని వాపోతున్నారన్నారు. కేవలం పింఛన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అవ్వాతాతల శాపం తప్పనిసరిగా టీడీపీకి తగులుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, ఎంపీటీసీ షఫాయితుల్లా పాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



బొమ్మినంపాడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ కోడలు స్వాతి

డీఎన్నార్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించండి

కైకలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ చిన్న కోడలు స్వాతి ఓటర్లను అభ్యర్థించారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు సచివాలయం పరిధిలో ఆమె సోమవారం ఇంటింట ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డీఎన్నార్ పర్యవేక్షించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ఫార్మసీ ముఖ్య భూమిక

గుడ్లవల్లేరు: ఆరోగ్య రంగంలో ఫార్మసీ ప్రముఖ పాత్రలో రూపు దిద్దుకుంటూ ముఖ్య భూమిక పోషిస్తుందని కాకినాడ జేఎన్‌టీయూ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ హెడ్ బి.భవాని అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ 14వ వార్షికోత్సవ వేడుకలకు సోమవారం ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఫార్మసీ రంగంలో విద్య, వ్యాపార, ఉద్యోగావకాశాలు మెరుగు పడుతున్నాయని చెప్పారు. జీవితంలో ఒక గొప్ప లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా అంకితభావంతో పయనించాలని విద్యార్థులకు సూచించారు. మన దేశం సాంకేతికంగా ఎంతో పరిణితి చెందుతూ వస్తుందన్నారు. కళాశాలలో ఉత్తమ ఫలితాలు కనబరిచిన విజేతలకు ఆమె చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం అతిథిని కాలేజీ యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రెసిడెంట్ వల్లభనేని సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భవాని

చంద్రబాబుకు ఎస్సీలు అంటేనే చులకన

గుడివాడ టౌన్: తొలి నుంచి కూడా చంద్రబాబు నాయుడుకు ఎస్సీలన్నా, పేదలన్నా చులకన అని రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక కాకర్ల వీధిలో సోమవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరుకూ ప్రజాప్రతినిధిగా పోటీచేసే హక్కు ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడు కూడా ప్రభుత్వ పాలనలో భాగస్వామి కావాలనే సంకల్పంతో విద్యావంతుడు, సమర్థుడైన టిప్పర్ డ్రైవర్‌కు, సామాన్య రైతు కూలీకి తన పార్టీ టికెట్‌లు ఇచ్చి ప్రజల్లోకి పంపడం సాహసోపేతమైన చర్య అన్నారు. సుమారు రెండు లక్షల పైచిలుక ఓటర్లు ఉన్న ఒక నియోజకవర్గంలో అతి సామాన్యుడు పోటీపడుతున్నారంటే తమ పార్టీ పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనపట్ల ప్రజల నమ్మకాన్ని గ్రహించారు కనుక టికెట్లు ఇచ్చారన్నారు. కచ్చితంగా వారు గెలుస్తారనే అక్కసుతో చంద్రబాబు నాయుడు టిప్పర్ డ్రైవర్, ఎడమచేతి వేలిముద్రగాడు, మూలన కూర్చుని తల ఊపేవాడు అని విమర్శించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్ని గౌరవించరన్నారు. కుల అహంకారంతో డబ్బుతో గెలవచ్చనేది చంద్రబాబు నాయుడు నమ్మకం అని పేర్కొన్నారు. ప్రజలు ఎంతో తెలివైన వారని వాస్తవాలు గ్రహించగలరన్నారు. ఈ ఎన్నికల్లో అహంకారానికి, డబ్బుకు ప్రజలు సమాధి కడతారని టిప్పర్ డ్రైవర్‌ను ప్రజలు గెలిపించుకుని చంద్రబాబు నాయుడుకు బుద్ధి చెబుతారన్నారు. రూరల్ మండల ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లేశ్వరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ చుక్కా నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా సురేష్, సాయిన నాగబాబు, దివ్యాంగుల విభాగం డివిజన్ ఇన్‌చార్జి దొండపాటి మధుకిరణ్ పాల్గొన్నారు.

కరాటే బెల్టు పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

పామర్రు: స్థానిక ఏఎస్ఎం హైస్కూల్లో సోమవారం కరాటే బెల్టు పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలను 7వ డాన్ బ్లాక్ బెల్టు గ్రహీత, ఏకేఎఫ్ జెడ్జి, ఏపీటీ డైరెక్టర్, కృష్ణాజిల్లా కరాటే బోర్డు కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ బెల్టు పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబర్చి పలు బెల్టులను సాధించారు. పరీక్షలలో ఒక బ్లాక్ బెల్టు, నాలుగు బ్రౌన్, ఎనిమిది బ్లూ, ఎనిమిది గ్రీన్, నాలుగు ఆరెంజ్, 20 ఎల్లో బెల్టులను విద్యార్థులు సాధించారు. మొత్తం 85 మంది విద్యార్థులు ఈ బెల్టు పరీక్షల్లో పాల్గొని ప్రతిభ ఆధారంగా బెల్టులు, ప్రశంసా పత్రాలను పొందారు. విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ వీవీ రామకృష్ణను ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి అభినందించారు.

బకాయి చెల్లించలేదని పంచాయతీకి పవర్ కట్

పామర్రు: విద్యుత్ పాత బకాయిలు చెల్లించలేదని పంచాయతీ పరిధిలోని రెండో సచివాలయ కార్యాలయాలకి విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపి వేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయతీ కార్యాలయానికి కొన్ని ఏళ్లుగా విద్యుత్ బిల్లు రూ.4.70 కోట్ల మేర బకాయి ఉందని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. బిల్లులు చెల్లించాలని విద్యుత్ విభాగం అధికారులు పలు మార్లు సంబంధిత అధికారులకు తెలిపినా వారు పట్టించుకోక పోవడంతో ఐదు రోజుల క్రితం కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. దీంతో కార్యాలయంలో పౌరసేవలు నిలిచిపోయాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీంను వివరణ కోరగా ఇప్పటికే బకాయిలో రూ.10,86,444ను చెల్లించామని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు.

బుక్ కీపర్లు, వెలుగు సిబ్బందికి జ్ఞాపికలు అందజేత

మండవల్లి: రుణాలు అందుకున్న మహిళలు కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు అన్నారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంక్‌కు సంధానకర్తలుగా వ్యవహరించి రుణాల మంజూరుకు సహకరించిన బుక్ కీపర్లు, వెలుగు సిబ్బందికి సోమవారం జ్ఞాపికలు అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ ఒక్కొక్క గ్రూపునకు గరిష్ఠంగా రూ.20 లక్షల రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎం రాజశ్రీ, సీసీలు పాల్గొన్నారు.